# స్రగ్ధర: మఱోచూపు

సంకలనం: కామేశ్వర పావనరాం, Newton, MA

గాండీవారావ ఝంపా ఘటిత భయ దివౌకఃపురాంతః పురంధ్రీ
గండా భోగ శ్రమాంభః కణ కలుషిత గంగా తరంగాభిషం గా
ఖండాస్మత్కాండ పాళీ కబళిత సకలాకాశసీమానిశాం తో
ద్దండాతిక్రాంతగర్భాంతక యమభట సంతానముం గానన్నైతిన్.

– ఉత్తర హరివంశం

ఈ పద్యాన్ని గ్రుక్క తిప్పుకోకుండా వినిపించడం సుహృన్మిత్రులు శర్మగారి వంతైతే, గ్రుక్కతిప్పుకోలేని సంతోషంతో వినడంనావంతైంది. పై పద్యం గురించి వివరిస్తూ "పద్యమంతా ఒకటే సంస్కృత సమాసం,ఒక్క ఆఖరి ముక్కతప్ప. ప్రతిపాదంలోనూ రెండు యతి స్థానాల్నీ; ప్రాసనీ పాటిస్తూ ఈ స్రగ్ధరని కూర్చాడు నాచనసోముడు" అన్నారు. ఉత్తర హరివంశంలో ధృవతారలాగ నిల్చిన ఏకైక స్రగ్ధర. దాని భావం చూడండి.

తా. అర్జునుడు తన గాండివము నెక్కుపెట్టి వింటినారిని మ్రోయింపగా అమరావతిలోని స్త్రీలు భయభ్రాంతలైరి. వారి చెక్కిళ్ళు చెమటబిందువులతో నిండినవి. ఆచెమట బిందువులచే ఆకాశగంగా జలములు కలుషితములైనవి. ఆ గంగానదీ తరంగముల వఱకు ఎడ తెఱిపిలేకుండ అర్జునుని బాణములు ఆకాశమంతటిని కప్పి వేసినవి. ఆవేకువజామున ఆబ్రాహ్మణశిశువు ప్రాణములను హరించుటకు వచ్చిన యమదూతలను, చూడజాలకపోతిని.

"ఒకడు నాచనసోమన" అన్న వైశ్వనాథీయ ఙ్ఞప్తి, "ఇంతటిదా స్రగ్ధర" అన్న తలపులో జీర్ణమయి, "ఒకటి స్రగ్ధరావృత్తము" అన్న సుభాషితంగా జాలువాఱి ఈ మలిచూపుగా మాలాకృతమయింది. (స్రక్ అంటే మాల) స్రగ్ధర మగణ ప్రారంభి. కావ్యమును మగణముతో ప్రారంభించడం మంగళప్రదం. నన్నెచోడుడు తన కుమారసంభవ కావ్యానికి స్రగ్ధరతోనే శ్రీకారం చుట్టాడు.

శ్రీవాణీంద్రామరేంద్రార్చిత మకుట మణిశ్రేణిధామాంఘ్రిపద్మా
జీవోద్యత్కేసరుం డాశ్రితజనలక్షితాశేషవస్తుప్రదుం డా
దేవాధీశుండు నిత్యోదితు డజుడు మహాదేవు డాద్యుండు విశ్వై
కావాసుం డెప్పుడున్ మా కభిమతములు ప్రీతాత్ముడై యిచ్చుగాతన్.

-కుమారసంభవం

ఇందు ఈశ్వరుని అవ్యక్త స్వరూపము వర్ణింపబడినది. ధామ = కాంతులు; అంఘ్రిపద్మ = అడుగుతామరలచే; ఆజీవ = బ్రతుకు గలిగి; ఉద్యత్ = ప్రకాశించుచున్న; కేసరుండు = ఆకరువులు కలవాడు.

వేరెవ్వరూ కావ్యాన్ని స్రగ్ధరతో శ్రీకరించిన జాడలు అగుపడవు, కానరావు.

ఈ మధ్య 'గర్భకవిత్వ' మనే వ్యాసంలో (రచన – జూన్ 2007) స్రగ్ధర గర్భంలో మంద్రాక్రాంతం ఒదిగి ఉంటుందని ఆరెండు వృత్తముల గురులఘువులను వివరించారు.

స్రగ్ధర – మ ర భ న య య య --- యతి 1,8,14
మంద్రాక్రాంత – మ భ న త త గ గ – యతి 1,5,11

తిక్కనగారు స్త్రీపర్వ ద్వితీయాశ్వాసాంతంలో రత్నం లాంటి మంద్రాక్రాంతాన్ని నిక్షేపించారు.

మంద్రాక్రాంతము.

వీణానాద ప్రతిమనిగమావిర్భవత్సారపుణ్య
శ్రేణీసంపాదిత విమలతాస్థేమనిర్లేపచిత్త
త్రాణక్రీడాకలనసతతోత్సాహవద్దివ్యభావా
ప్రాణాపానాహరణనిపుణప్రాపణీయానుభావా

స్రగ్ధర రత్నగర్భికదండీ! సంస్కృతకృతుల్లో స్రగ్ధరలూ, మంద్రాక్రాంతాలు విరిపాలు. తెలుగు కావ్యాల్లో అపురూపాలు. కవి త్రయానికీ, ప్రబంధకవులకీ వారధి శ్రీనాథుడు అంటారు! 'ప్రణవ మనుక్రేపుతోకూడిన సురభి'అని ప్రణుతించి, కాశీఖండంలో 'గాయత్రి'ని 'స్రగ్ధర' లో బిగించిన కవిసార్వభౌముల తేవని పరికించండి. స్రగ్ధర:

గాతారం త్రాయతే నాగలిగినతెలివిన్ గల్గె గాయత్రి కర్తా
న్వీతం బై నామధేయం బితరమనువులు దీప్రభావంబు లే దీ
ప్రాతర్మధ్యాహ్నసాయోపగమముల బర బ్రహ్మవిద్వాంసు లార్యుల్
జ్యోతిర్మూర్తిన్ భజింతు ర్సురగణవినుతున్ సూర్యునిన్ సిద్ధవిద్యన్

(3-184)

కాశీఖండంలోనే, గజదైత్యుని 'నవష్టంభసదంచ విజృంభణాన్ని' స్రగ్ధర లో కూర్చిన వైనం తిలకించండి.

స్ర: చించెం జండాడె మట్టెం జిదిమె విఱిచె గ్రొచ్చెన్ విఘట్టించె దంచెన్
ద్రుంచె జక్కాడె మోదెం దొడసె గెడపె న త్త్యుద్ధతిం గాశిసీమన్
బంచక్రోశీధరిత్రీ పరిధి గరిసుర ప్రత్యనీకుండు హేలా
సంచారోదగ్రభంగిన్ బలముకొని వనీ సౌధవప్రాట్టవీథుల్ (6-176)

అల్లసాని పెద్దన 'మౌనుల యొద్దికలో స్వరోచి పెరుగునటను' వర్ణించిన ఈ దిగువ స్రగ్ధరలో పై శ్రీనాథ స్రక్ ఛాయల్ని గుర్తించగలరు.

స్ర: గ్రుద్దున్ గోత్రాచలంబుల్ గులగులలయపో గోతముల్ గ్రుద్దులీలన్

ఖడ్గిన్ జెండాడు మ్రాకుల్ కవుగిటికొలదుల్ కత్తినొక్కొక్క ఘాతన్
బ్రోద్ధామప్రౌఢి వాతద్భుతగతి బఱుమన్ భూమి జవ్వాడగా ని
ట్లద్దేవీ నందునుం డత్యనుపమ బలుడై యౌవనారంభవేళన్ .

- మనుచరిత్ర 4-8

ఈ రెంటిలోనూ 'ఔద్ధత్యం' కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది!

ఆముక్తమాల్యద తెలుగు పంచకావ్యాల్లో ఒకటి 'మనుచరిత్ర' లాగే రాయలవారి ప్రకృతి వర్ణనలు అందాలకు, ఆనందాలకు పెన్నిధులు (బేతవోలు). వర్షఋతువర్ణన అరువది పద్యములు, శరదృతువర్ణన నలుబదియేడు పద్యములు. ఇట్టి వర్ణనలు సృష్టిలో మరియొకడు చేయలేడు. ఇంకొక చోట నుండవు. 'పొమ్మన్నారు విశ్వనాథులు (యువభారతి ప్రచురణ పీఠికలో)

ఓజస్సనగా సమాసప్రాచుర్యము. బంధకార్కశ్యము, గాఢ సంస్కృతము వర్షాకాల వర్ణనలో చూడగలరు.

స్ర: గ్రావాళిం గేతకీకోరకకుటజరజోరాజి దూర్వాంకురశ్రీ
తో వీక్షింపం దినానుత్రుటి మఱుపడుచుందోచు చిట్లా తిరోభా
వావిర్భావంబులం బాయక పొరయ నభస్సభ్రము ల్గప్పి పై నెం
తే విప్పె పింఛికల్ బర్హిణులు దిరుగ బెల్లింద్రజాలంబు జూపెన్.

- ఆముక్తమాల్యద 4-112

కేతకీకోరక = మొగలిమొగ్గల; కుటజ = కొండమల్లెమొగ్గల; రజోరాజి = పరాగపంక్తి; దుర్వాంకుర = గరికమొక్కల; శ్రీతోన్ = సంపదతో; దిన = పగటి; అనుత్రుటిన్ = ప్రతిక్షణమందు; నభస్సు = శ్రావణ; అభముల్ = మేఘములు; ఎంతేవిప్పె = వ్యాపించి; పెల్లు = అధిక.

శ్రావణమాసమను నైంద్రజాలికుడు, మేఘములను తెరవేసి, నెమ్మళ్ళపింఛములు వ్యాపింపజేసి యింద్రజాలవిద్యను గనుపఱిచెను.- అని దీని భావం.

భావనైశిత్యానికీ, అర్థక్లిష్టతకీ అద్దంపట్టే జల్లెడ మఱొక స్రగ్ధర. రాయలవారి శరదృతు వర్ణన.

స్ర. సంభూతజ్ఝ ష్టివాతా శనశయనము విశ్వంభరుం డూదిలేవన్
గంభీరప్రక్రియామగ్నత డిగు జగతిం గ్రందుగా దోచు వర్షా
దంభోళిస్థూలరంధ్రోద్గతసితపృథుపాతాళజాతాంబుధారా
స్తంభంబుల్పోలెనెన్ను ల్దవళరుచిశరస్తంబపంక్తిం జనించెన్.

- ఆముక్తమాల్యద 4-143

తెల్లపొదలు ఎన్నులు తీసి తెల్లగా ప్రకాశిస్తున్నాయి. శ్రీమహావిష్ణువు ఊది లేవగా భూమియందు పడిన పిడుగులు చేసిన రంధ్రములనుండి పాతాళమున బడు స్తంభముల వంటి జలధారలవలె తెల్లకాడలకు వెన్నులు తెల్లవిగా పుట్టాయి. అని దీని భావం. ఇది శ్రీకృష్ణదేవరాయల ప్రకృతి పరిశీలనా, ఔహ్యాసాంద్రతల మేళవింపుకు మచ్చుతునక.

ముక్కుతిమ్మనార్యుని ముద్దుపల్కుకి స్రగ్ధరావృత్తము వేసవిసంపెంగె అని సరి పుచ్చుకున్నా; క్లిష్టమూర్తులకు అదే - భట్టుమూర్తుల స్రగ్ధరా వైముఖ్యానికి కారణం అనూహ్యం.

ఎక్కిరాలవారు రామకృష్ణుని స్రగ్ధరలంటూ ఉద్భట... లో ఒకటి, పాండురంగ.... లో మూడు స్రగ్ధరలను సూచించారు.

అందులో ఒక స్రగ్ధరాశాకల్యం గమనించండి; రామకృష్ణుని పదగుంభనకు తార్కాణంగా! స్ర.

పూర్వద్వార్ధ్వన్, సితాంగిన్, భువనవినుత, నంభోరుహాభ్రూణురాణిన్,
బర్వేందుస్పర్ధివక్త్రన్, భగవతి, నఖిలప్రాణిధీమూర్తి, వాణిన్.

ఏనుగులక్ష్మణకవి, ఆంధ్రీకృత త్రిశతక సుభాషితాల్లో శృంగార శతకవిభాగంలో - విరహుల హేమంతఋతురాత్రుల దైర్ఘ్యాన్ని, స్రగ్ధరలో తీక్ష్ణీకరించారు.

స్ర. ప్రోద్యత్ప్రౌఢప్రియంగుస్ఫుటరుచియుతమై ఫుల్లమల్లీమతల్లీ
మాద్యత్సారంగమై హైమసపవనచల న్మంజుమందారభూజా
తద్యోతంబైన హేమంతమున విరహసంతప్తులౌవారి కెల్లన్
సద్యామాయామరాత్రుల్చను విషమయమస్థానసాదృశ్య మూర్తిన్.

మూలశ్లోకంలో భర్తృహరి 'కణ్ఠలగ్నాక్షణమపితుహినక్షోద దక్షావృగాక్షీ' అన్నారు.

దట్టముగ పెరిగిన ప్రేంకణపు పూవుల కాంతితో కూడినదియు, వికసించిన మల్లె పూవులయందు మదించిన తుమ్మెదలు కలదియు, మంచుగాలులచే కదలుచు, అందమైన మందార మొక్కలు కలదైన హేమంత ఋతువునందు విరహులకు రాత్రులు దీర్ఘములై, విషమయములగుచున్నవి. అని దీని భావము. (నన్నయగారి 'దీర్ఘవాసరనిశ' లవలె.)

శృంగార సుభాషితాల్లో 'స్రగ్ధర' చొప్పడడం ఆశ్చర్యమే ! ప్రేమ ,విరహాలు శృంగారానికి బొమ్మ, బొరుసు లనుకుంటే - అవి ఘాటుదేరినప్పడు 'స్రగ్ధర' ఆవశ్యకత సమర్థనీయమై ఉండొచ్చు.

అర్థశతాబ్దం క్రితం, చలన చిత్ర నాయిక "ఎంతఘాటు ప్రేమయో" అని విలపించింది. అది విని 'ఇంత లేటు వయస్సులో' అని ఆరుద్ర కాలప్రభావాన్ని చమత్కరించారట!

'అవధాన' ప్రక్రియ సంస్కృతభాషలో బీజప్రాయమైనా, 'తెలుగు'లో భూజంగా - శాకోపశాఖల విస్తరణతో విరాజిల్లింది. మరే (ఇ)తర భాషల్లోనూ ఈ సడి వినం. ఇది ఆంధ్ర భాషా కేవలైకభూషణం.

చిన్నచిన్న వస్తువుల మీద (శ్రీ శ్రీ అన్నట్టు - కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపెట్టెలాంటి) సీసాలనూ, స్రగ్ధరలలోనూ కూర్చమని, అవధానుల నిరకాటంలో పెట్టడాం కొందరికి సరదా. ఒక ప్రాశ్నికుడు తలవెంట్రుకమీద 'స్రగ్ధర చెప్పమనగా, కొప్పరపు సోదరులు ఆశువుగా చెప్పిన పద్యం.

అంభోజాతాక్షి వేణిన్ హరువు గనిన రోమాతి సౌభాగ్యమెంతే
సంభావింతున్ పయోముక్సముదయరుచులున్ స్ఫారరోలంబ కాంతుల్
శుంభద్ధ్వాంత ప్రభల్ హెచ్చుగదొని విధి మెచ్చొప్పగా గూర్చి యాపై
జంభద్విడత్న రోచుల్ చమిరి యొనరుపన్ చక్కనౌ తీవయోనాన్.

మబ్బువలె, తుమ్మెదవలె, చీకటివలె, ఇంద్రనీలం వలె నల్లగా ఉన్న తలవెంట్రుక అందం మాలాకృతమయింది. - స్రగ్ధరాయణం లో చక్కని తీవ!

మఱొక్క అచ్చతెనుగు స్రగ్ధర: 'యయాతి చరిత్ర' (పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, 2001) లో ద్వితీయాశ్వాసం లోనిది. (కృతికర్త: పొన్నగంటి తెలగన).

తుండించెన్మన్నుబిళ్ళం,దునియెగణుదులంద్రుంచెజివ్వంగి మూకం
జండాడెం గొండగొర్లం, జెలగె నెలుగులం, జించెగార్పోతులన్మై
కండల్గా జేసె నిర్లం, గలచె జిఱుతలన్, గ్రండికల్ చేసినేల
న్నిండించెన్ దుప్పులం మన్నిదమున కొకటి న్లేకయుండగ నచ్చొన్.

2- 32

ఇది యయాతి మహారాజు వేట వర్ణన. ఒక్క జంతువు మిగులకుండ, మనుబోతులను, కణుతులను, సివంగులను, కొండగొర్లను, ఎలుగులను, అడవిదున్నలను, జింకలను, చిరుత పులులను, దుప్పులను -అన్నిటినీ వేటలో ఖండించెనని దీని భావము.

ఈ పద్యమున చంపెననుటకు తుండించె, తునిమె, త్రుంచె, చెండాడె, చెలగె, చించె, మైకండల్గా జేసె, కలచె, కుండికల్ జేసె అని యన్ని గౌణక్రియలు ప్రయోగింపబడినవి. ఇది యిందలి విశేషమని వ్యాఖ్యాత కపిలవాయి లింగమూర్తి గారు అభిప్రాయబడ్డారు. పుట 296.

సంస్కృతమున భోజరాజు 'రౌద్రమున స్రగ్ధరాదులను నిబంధింపదగు' అని పేర్కొనెను. - అంటూ వి.వి.యల్ గారు తమ సిద్ధాంతగ్రంథములో ఉటంకించినవీ దిగువ పలుకులు గమనార్హములు:

"9 లఘువులు 12 గురువులుగా నడచు స్రగ్ధర.... పాదదైర్ఘ్యమునకు తోడు గుర్వక్షర బాహుళ్యముచే మహాభుజుల వీరరౌద్రముల పరిణాహము స్ఫురింపచేయునదిగా నుండును. మహర్షి 'వీరస్య భుజదండానాం వర్ణనే స్రగ్ధరా భవేత్" అను కాత్యాయనోక్తి జ్ఞప్తి కెలయించుట సాభిప్రాయమే.' 'స్రగ్ధర' భావవైశిష్ట్యసాధనకే' అని కూడ వీరుగుర్తించారు.

సౌప్తిక పర్వంలో అశ్వత్థామ అర్ధరాత్రి పాండవశిబిరంలో జొరపడి చేసిన మారణహోమం రౌద్ర, భయానక రసమయం. ఈ భీభత్సాన్ని తిక్కనగారు 6 స్రగ్ధరలలోనూ, 14 మహాస్రగ్ధరలలోనూ చిత్రించారు. ('ఏపర్వంలోనూ వాడనన్ని') వాడారు అన్నారు ఆరుద్ర సమగ్ర ఆంధ్రసాహిత్యం - 1 - 323) స్రగ్ధరలో మొదటి గురువుని, రెండు లఘువులు చేస్తే 'మహాస్రగ్ధర ' ఔతుంది.

ఈ ప్రస్తావనలో స్రగ్ధర వీరరౌద్రములకే కాక రేవ, ఔద్ధత్యాలకూ, భావవైశిత్యానికీ కూడా ఉపచితమనీ సోదాహరణించడమయినది.

నన్నయ, నాచనసోమన, కరికవి (ఏనుగులక్ష్మణ)లకు స్రగ్ధర ఏక'లవ్య'మగుటవలన - ఈ ప్రస్తావనని 'ఒకటి స్రగ్ధరా వృత్త'మని (**Take home message**) సంభావించట మయినది.

ఈ సంకలనం విహంగవీక్షణ ప్రాయమే ఏవిధంగానూ సమగ్రం కాజాలదు. పద్యార్తులకు దశమస్కంధంలోనో, కాళహస్తి మహాత్మ్యంలోనో శృంగారనైషధంలోనో స్రగ్ధరలు కనబడకపోవు సరసులు, ఈ అదనపు దళాలను ఏర్చి,పేర్చి, కూర్చుకొన్న సతత హరితమాలా సౌరభాన్ని - ఇంద్రీవారుణాదిచ్ఛవిన్ - ఎల్లెడలా - సురభీకరించుకో గలరని నా ఆకాంక్ష !

అస్తు.

సూచిక:

1. కవిత్రయం వారి స్రగ్ధరలను ఇదివరలో బ్రాహ్మి, జూలై-సెప్టెంబరు 2008 సంచికలో తడవడ మైనందున , ఇప్పటి ప్రస్తావనని 'మఱో చూపు' అనడమయింది.

2. ఆచార్య శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారి తెలుగు వ్యాఖ్య 'అనర్ఘరాఘవం' లో 20 దాకా ఉన్నాయి. సంస్కృత స్రగ్ధరలు (1992) వీటిని 'తిరుగ మోతగా' రాయడం వలన కల్గిన స్పందన ఈ రచనకి ప్రేరేపణ.

3. డా. ఎక్కిరాల కృష్ణమాచార్య: తెనాలిరామకృష్ణుని కావ్య పరి శీలనము (1996); పుట270, ఉద్ధృట 2-96; పాండురంగ 2 - 159,185; 4- 302.

4 డా. ప్రసాదరాయకులపతి: కవితామహేంద్రజాలము (1998) - పుట 97;

5. డా. వి.వి.యల్. నరసింహారావు: అక్షరరమ్యత నన్నయ కవిత్వము.(1977)- పుట 298 - 299.